'పల్లె' తొలి విడత పోరులో సిపిఎం సత్తా

- రాష్ట్ర వ్యాప్తంగా 27 చోట్ల సర్పంచ్‌ల కైవసం
- పలుచోట్ల దక్కిన ఉప సర్పంచ్ పదవులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామ పంచాయతీ 'మొదటి విడత' ఎన్నికల పోరులో సిపిఎం మెరుగైన ఫలితాలను సాధించింది. రాష్ట్రవ్యాప్తంగా 27 చోట్ల సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకున్నట్టు ఆ పార్టీ నేతలు తెలిపారు. అత్యధిక వార్డుల్లో గెలుపొందడంతో పాటు ఉప సర్పంచ్ పదవులు పార్టీ అభ్యర్థులకు దక్కాయని తెలిపారు. పూర్తి వివరాలు అందాల్సి ఉందని, మిగతా రెండు విడతలు ఎన్నికలు పూర్తి అయిన తర్వాతే పూర్తి లెక్కలు తేలుతాయని అన్నారు. పోటీ చేసిన ప్రతిచోట పార్టీ అభ్యర్థుల ప్రాతినిధ్యం ఉందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అత్యధిక గ్రామ పంచాయతీల్లో సిపిఐ(ఎం) మద్దతుదారులు గెలిచారు. ఆ తర్వాత నల్లగొండతో పాటు రాష్ట్రంలోని మరికొన్ని జిల్లాల్లోని పంచాయతీలను, వార్డులను కైవసం చేసుకున్నారు.

ఖమ్మం జిల్లాలో సిపిఐ(ఎం) 28 సర్పంచ్ స్థానాల్లో పోటీ చేయగా 10 సర్పంచ్‌ల్లో గెలిచింది. అలాగే, 75 వార్డుల్లోనూ గెలిచింది. ఇటీవల హత్యకు గురి అయిన సీపీఐ(ఎం) సీనియర్ నేత సామినేని రామారావు స్వగ్రామం చింతకాని మండలం పాతర్లపాడులో సర్పంచ్, ఉప సర్పంచ్ పదవులను ఆ పార్టీ అభ్యర్థులే కైవసం చేసుకున్నారు. ఇదే మండలం కొదుమూరు, పందిళ్ళపల్లి, నాగులవంచ రైల్వే కాలనీల్లోనూ ఆ పార్టీకి చెందిన అభ్యర్థులు సర్పంచులుగా ఎన్నికయ్యారు. నరసింహపురం ఉపసర్పంచ్ స్థానంలోనూ గెలుపొందింది. బోనకల్ మండలంలో గోవిందాపురం (ఎల్), గార్లపాడు,

లక్ష్మీ | లక్ష్మీ నారాయణ | శ్రావణ్ కుమార్ | అనిత

పెద్దబీరవల్లిలో సర్పంచ్, ఉప సర్పంచ్ పదవులను దక్కించుకోగా, బోనకల్‌తోపాటు ఆళ్లపాడు, గుండ్రాతిమడుగులో ఉప సర్పంచ్‌లుగా సిపిఐ(ఎం) అభ్యర్థులు గెలుపొందారు. కొణిజర్ల మండలంలోని మూడు స్థానాల్లో సిపిఐ(ఎం) పోటీ చేయగా గోపవరం సర్పంచ్, ఉప సర్పంచ్ స్థానాలను గెలుచుకుంది. సింగరాయపాలెం సర్పంచ్ స్థానంతో పాటు సిద్దినగరం ఉపసర్పంచ్‌పదవులను ఆ పార్టీ అభ్యర్థులు దక్కించుకున్నారు. మండలంలోని జానకీపురం సర్పంచ్‌గా సిపిఐ(ఎం) బలపరిచిన స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. వైరా మండలం అష్టగుర్తి సర్పంచ్, ఉప సర్పంచ్, మధిర మండలం మల్లారంలో సర్పంచ్, ఉప సర్పంచ్ పదవులనూ ఆ పార్టీ గెలిచింది. రఘునాథపాలెం మండలం గణేశ్వరం, ఎర్రుపాలెం మండలం నరసింహాపురం, తిమ్మినేనిపాలెం ఉప సర్పంచ్ పదవులను సిపిఎం అభ్యర్థులు గెలుచుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పది గ్రామాల్లో సర్పంచ్ స్థానాలు, 75 వార్డుల్లో సిపిఎం గెలుపొందింది. దుమ్ముగూడెం మండలంలో లక్ష్మీనగరం, దుమ్ముగూడెం, పగళ్లపల్లి, అజిపాక, రామారావుపేట, మహదేవపురం, మణుగూరు మండలంలో పగిడేరు, పినపాక మండలంలో బోటిగూడెం, వెంకటరామపురం, బూర్గంపాడు మండలంలో టేకులచెర్వులో సిపిఎం గెలిచింది.

నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడులో సర్పంచ్, ఉప సర్పంచ్ పదవులను సిపిఐ(ఎం) గెలుపొందింది. మునుగోడు మండలం కాల్వపల్లిలో సర్పంచ్, ఉప సర్పంచ్‌లను కైవసం చేసుకుంది. ఈ జిల్లాలో ఐదు ఉపసర్పంచ్ పదవులను సిపిఎం మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం చిల్వకుంట్లలో సిపిఐ(ఎం) అభ్యర్థి సర్పంచ్‌గా గెలుపొందారు. సూర్యాపేట జిల్లాలోని ఎనిమిది మండలాల్లోని 19 వార్డుల్లో తమ పార్టీ మద్దతుదారులు గెలుపొందినట్టు ఆ పార్టీ నేతలు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు మండలం తుర్కుగూడెంలో సర్పంచ్ స్థానాన్ని కైవసం చేసుకుంది. అందిన సమాచారం మేరకు జిల్లాలో తొమ్మిది వార్డుల్లో గెలిచినట్టు ఆ పార్టీ నేతలు తెలిపారు. నిజామాబాద్ జిల్లా రూరల్ మండలం నింగి తండాలో సిపిఎం బలపరిచిన సర్పంచ్ అభ్యర్థితో పాటు 6వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మరో 2 వార్డుల్లో గెలిపొందారు.

వనపర్తి జిల్లా సింగరాయపల్లిలో పోటీ చేసిన 4 వార్డుల్లో సిపిఎం బలపరిచిన అభ్యర్థులు గెలుపొందారు. రేపల్లె మండలం చెరుకుపల్లిలో పోటీ చేసిన ఒక వార్డులో విజయం సాధించారు. గద్వాల జిల్లా గట్టు మండలం గొర్లఖాన్ దొడ్డిలో 2 వార్డుల్లో విజయం సాధించారు. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం పెదిరిపాడులో ఒకటి, మహబూబ్‌నగర్ జిల్లా జూలపల్లిలో సర్పంచ్, ఆరు వార్డుల్లో విజయం సాధించారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కిష్టంపల్లిలో రెండు వార్డుల్లో విజయం సాధించారు. జాజులలో 8 వార్డులకు నాలుగు వార్డులు, పోతారెడ్డిపల్లిలో 4 వార్డుల్లో విజయం సాధించారు. తెలకపల్లి మండలం బొట్టుల్లిలో నాలుగో వార్డులో విజయం సాధించారు. కల్వకుర్తి మండలం ముకరాల గ్రామంలో ఒకచోట విజయం సాధించారు.

ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం కుండి షేక్‌గూడలో ఐదు వార్డుల్లో విజయం సాధించారు. ఉప సర్పంచ్ పదవిని కైవసం చేసుకున్నారు. నిర్మల్ జిల్లా మామడ మండలం బూరుగుపల్లిలో ఏకగ్రీవం అయింది. 21 వార్డులకు గాను పది ఏకగ్రీవం అయ్యాయి. పెంబి మండలం గుమ్మేనా ఎంగ్లాపూర్‌లో ఉపసర్పంచ్ పదవిని కైవసం చేసుకున్నారు. మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం మండలంలో రెండు వార్డుల్లో గెలిచారు. జనగామ జిల్లా చిల్పూర్ మండలం క్రిష్టాజిగూడెంలో ఉప సర్పంచ్ పదవిని సీపీఐ(ఎం) గెలుచుకుంది. గబ్బెటలో ఉప సర్పంచ్ పదవిని కైవసం చేసుకుంది. స్టేషన్‌ఘనపూర్‌లోని ఇప్పగూడెం ఉప సర్పంచ్‌తో పాటు ఆరు వార్డుల్లో గెలుపొందారు. రంగరాయిగూడెం, సముద్రాలు, కోమటిగూడెం గ్రామాల్లో ఉపసర్పంచ్ పదవులను, తాటికొండలో ఒక వార్డులో విజయం సాధించారు. ములుగు జిల్లా గోవిందరావుపేటలో ఒక వార్డు, భూపాలపల్లి జిల్లా చిన్నకొడపాకలో వార్డు, హన్మకొండ ఎల్కతుర్తి, రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం దేవునితండాలో వార్డు సభ్యులుగా గెలుపొందారు.

మేడారంలో మాస్టర్ ప్లాన్

- అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి
- నాణ్యతా ప్రమాణాలు పాటించాలి
- మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో జరగబోయే సమ్మక్క-సారలమ్మ గిరిజన మహా జాతరకు వచ్చే సందర్శకులు అమ్మవార్ల గద్దెలను సునాయాసంగా దర్శించుకుని మొక్కులు చెల్లించుకునే విధంగా చేపట్టిన మాస్టర్ ప్లాన్ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. శుక్రవారం మేడారంలోని సమ్మక్క సారలమ్మ దేవాలయ గద్దెల పునరుద్ధరణ అభివృద్ధి పనులను, దేవాలయ ప్రాంగణంలోని పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల రాతి నిర్మాణాలను, ఆలయ ప్రాంగణ ఫ్లోరింగ్ పనులను, రాతి స్తంభాల స్థాపన నిర్మాణ పనులను, జంపన్న వాగు వద్ద పనులను మంత్రులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఎం ప్రత్యేక కార్యదర్శి శ్రీనివాసరాజు, ములుగు డిఎస్పి రవీందర్, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్, ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ భానోత్ రవిచందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ రేగ కల్యాణి, పూజారుల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు, ఆర్‌అండ్‌బి, ఇఎన్‌సి మోహన్ నాయక్, ఇంజనీరింగ్, పోలీస్, వివిధ శాఖల అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

మాదాపూర్ ప్రైమరీ స్కూల్లో ఫుడ్ పాయిజన్

- మధ్యాహ్న భోజనం వికటించి 42 మందికి అస్వస్థత

హైదరాబాద్ బ్యూరో : రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ డివిజన్ పరిధిలోని చంద్ర నాయక్ తండాలోని ప్రభుత్వ ప్రైమరీ స్కూల్లో మధ్యాహ్న భోజనం వికటించి 42 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. భోజనం అనంతరం విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. గమనించిన టీచర్లు వెంటనే స్థానికులతో కలిసి విద్యార్థులను కొండాపూర్‌లోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఆరుగురి పరిస్థితి విషమించడంతో ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. టీచర్లు, విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలలో రోజు మాదిరిగానే విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేశారు. కొద్దిసేపటికే సుమారు 40 మంది వాంతులు చేసుకున్నారు. గమనించిన టీచర్లు వెంటనే కొండాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరుగురు విద్యార్థుల పరిస్థితి విషమంగా ఉండటంతో దగ్గరలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. మిగతా విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని, వారిని అబ్జర్వేషన్ అనంతరం ఉదయం ఇండ్లకు పంపించే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. పిల్లలకు ఎలాంటి ఇబ్బంది లేదని వారు తెలిపారు.

పంచాయతీ కార్మికునిపై హోంగార్డు దాడి

- చర్యలు తీసుకోవాలని కార్మికుల ధర్నా
- సిఐటియు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిద్దిపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న బోజు బాలేష్‌పై పోలీస్ హోంగార్డు బూరుగు భానుచందర్ శుక్రవారం దాడికి పాల్పడ్డాడు. బాధితుడు బాలేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలేష్ ప్రతిరోజూ గ్రామపంచాయతీ భవనం ముందు వాటర్ పైపుతో చెట్లకు నీళ్లు పడుతుంటాడు. అయితే గ్రామ పంచాయతీకి ఎదురుగా హోంగార్డు భానుచందర్ ఇల్లు ఉంది. హోంగార్డు తన కారును గ్రామపంచాయతీ భవనానికి ఎదుట పెట్టి పంచాయతీకి చెందిన నీళ్లతో కారును కడుగుతుండేవాడు. అయితే విధుల్లో భాగంగా పంచాయతీకి ఎదురుగా శుక్రవారం బాలేష్ నీళ్ల పడుతున్నాడు. ఈ క్రమంలో ఆ వాటర్ పైప్ ఇవ్వాలని హోంగార్డు భానుచందర్ అడగ్గా.. పంచాయతీ భవనం ముందు భాగంలో నీళ్ల కొట్టి ఇస్తానని బాలేస్ చెప్పాడు. దాంతో ఒక్కసారిగా కోపోద్రిక్తుడైన సదరు హోంగార్డు తనపై దాడికి దిగాడని బాధితుడు బోరున విలపిస్తూ తెలిపాడు. దాంతో గ్రామపంచాయతీ సిబ్బంది విధులను బహిష్కరించి రోడ్డుపై బైటాయించి ధర్నా నిర్వహించారు. ధర్నా స్థలానికి చేరుకున్న పంచాయతీ కార్యదర్శి గద్ద వెంకటేశ్వర్లు.. దాడి చేసిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని హామీ ఇవ్వడంతో సిబ్బంది ధర్నా విరమించారు.

హోంగార్డుపై చర్యలు తీసుకోవాలి..

గ్రామపంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందిపై పోలీస్ హోంగార్డు దాడిచేయడం పట్ల పంచాయతీ కార్మికుల యూనియన్ (సిఐటియు) మద్దూర్ మండల గౌరవ అధ్యక్షులు ఆలేటి యాదగిరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం గ్రామ ప్రజల సేవలో ఉండే గ్రామ పంచాయతీ సిబ్బందిపై దాడి చేసిన హోంగార్డుపై చర్యలు తీసుకోవాలని, కార్మికులకు భద్రత కల్పించాలని పంచాయతీ కార్యదర్శి గద్ద వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎండి షఫీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్

- బాగ్‌లింగంపల్లి మైనార్టీ గురుకుల హాస్టల్‌లో ఘటన
- 22 మంది విద్యార్థినులకు అస్వస్థత
- కింగ్ కోఠి, నీలోఫర్ ఆస్పత్రులకు తరలింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని మైనార్టీ గురుకుల వసతిగృహంలో ఫుడ్ పాయిజన్ అయ్యింది. హాస్టల్‌లో ఉదయం ఉప్మాతిన్న 22మంది విద్యార్థినులు కడుపునొప్పితో బాధపడ్డారు. కొందరు విరోచనాలు, వాంతులతో ఇబ్బంది పడటంతో వారిని పాఠశాల ప్రిన్సిపాల్ వాణిశ్రీ వెంటనే కింగ్ కోఠి, నీలోఫర్ ఆస్పత్రులకు తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు అశోక్ ఘటనా స్థలానికి చేరుకొని పాఠశాల వద్ద ఆందోళన నిర్వహించారు. విద్యార్థినులకు పెట్టే భోజనం నాణ్యంగా ఉండటం లేదన్నారు. ప్రిన్సిపాల్‌ను దీనిపై ప్రశ్నించగా సమాధానం దాటవేశారని, ఎవరికీ తెలియకుండా విద్యార్థినులకు చికిత్స అందించడమేంటని ప్రశ్నించారు. అనంతరం ఆస్పత్రికి వెళ్లి విద్యార్థినులను పరామర్శించి.. వైద్యులతో మాట్లాడారు.

విద్యార్థినులను పరామర్శించిన అదనపు కలెక్టర్

కింగ్ కోఠి ఆస్పత్రికి విద్యార్థినులను తీసుకొచ్చిన వెంటనే కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సంతోష్ బాబు వైద్య బృందాన్ని అప్రమత్తం చేసి చికిత్స అందించారు. వారి ఆరోగ్య పరిస్థితి మెరుగు పడటంతో చిల్ట్రన్స్ వార్డుకు మార్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కడుపునొప్పి, డీ హైడ్రేషన్ కారణంగా అవస్థతకు గురయ్యారని, వారందరికీ గ్లూకోజ్, వివిధ రకాల రక్త పరీక్షలు నిర్వహించి వైద్యం అందిస్తున్నామన్నారు. ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు. విషయం తెలుసుకున్న జిల్లా అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి చిల్ట్రన్స్ వార్డుకు వచ్చి విద్యార్థినులతో మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితిపై సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై విచారణ కమిటీ వేశామని, రిపోర్ట్ రాగానే బాధ్యుల మీద తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట డిప్యూటీ డిఎంహెచ్ఒ శ్రీకళ, ఆస్పత్రి వైద్యులు విజరత్, సోమశేఖర్, ఎల్‌టి నరసింహారెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ శమంతకమణి, గ్రేడ్ టు పద్మ, సాహేద బేగం ఉన్నారు.

10 రోజుల కష్టానికి రూ.2 వేల నుంచి రూ.3,500 మాత్రమే

- ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు స్వల్ప రెమ్యూనరేషన్
- కేంద్ర ఎన్నికల సంఘం (ఇసి), రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తుంగలో తొక్కిన పంచాయతీరాజ్ శాఖ
- తక్షణమే సవరించాలి
- రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు టిఎస్ యుటిఎఫ్ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రాత్రింబవళ్లు కష్టపడి, 10 రోజుల పాటు విధులు నిర్వహించిన వేలాది మంది ఉపాధ్యాయులు, అధికారులకు స్వల్ప మొత్తం రెమ్యునరేషన్ నిర్ణయించి పంచాయతీరాజ్ శాఖ తీవ్రమైన అవమానానికి గురి చేసిందని తెలంగాణ రాష్ట్ర యూనైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్ నేతత్వంలో నాయకులు రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో పాటు పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శికి, డైరెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులుగా పని చేసిన ఉద్యోగులకు ఎన్నికల సంఘం నిర్దేశించిన రేట్ల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించకుండా భిక్ష వేసినట్లు రోజుకు రూ.200 కంటే తక్కువగా నిర్ణయించడం పట్ల వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 10 రోజులకు స్టేజ్-1 రిటర్నింగ్ అధికారి కేవలం రూ.3,500, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారికి రూ.2,200, స్టేజ్-2 రిటర్నింగ్ అధికారికి కేవలం రూ.2 వేలు, అదే సమయంలో ప్రతి రోజు సాధారణ టిఎ, డిఎతో పాటు మూడో వంతు అదనంగా డిఎ చెల్లించాలని టిజిఎస్ఇసి నవంబర్ 29న లేఖ ద్వారా స్పష్టంగా ఆదేశించిందని వారు గుర్తు చేశారు.

టిజిఎస్ఇసి ఇచ్చిన మార్గదర్శకాలను తుంగలో తొక్కి, పంచాయతీరాజ్ శాఖ డిసెంబర్ 10న మెమో ఇచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్టేజ్ 1, స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారుల మధ్య రెమ్యూనరేషన్లో కూడా తీవ్రమన వ్యత్యాసం ఉందని చెప్పారు. దీంతో గురువారం పూర్తయిన మొదటి విడత ఎన్నికల్లో పలు గ్రామ పంచాయతీల్లో ఉపాధ్యాయులు ఈ రెమ్యూనరేషన్‌ను తిరస్కరించారని తెలిపారు. కొన్ని జిల్లాల్లో ఆ రెమ్యునరేషన్ కూడా ఇవ్వలేదనీ, దాంతో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారని పేర్కొన్నారు. మిగిలిన రెండు దశల ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగాలంటే పంచాయతీరాజ్ జారీ చేసిన మెమోను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. టిజిఎస్ఇసి నిర్దేశించిన రేట్ల ప్రకారం పూర్తి టిఎ, డిఎ, మూడో వంతు అదనపు డిఎ చెల్లించాలని కోరారు.

రిటర్నింగ్ అధికారుల రెమ్యూనరేషన్ పెంచాలి

- రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శికి టిఆర్‌టిఎఫ్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామ పంచాయతీ స్టేజ్ 1, స్టేజ్ 2 అధికారుల రెమ్యూనరేషన్ పెంచాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టిఆర్‌టిఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శికి ఫెడరేషన్ అధ్యక్షులు, కటకం రమేష్, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి వినతిపత్రం అందజేశారు. రెమ్యూనరేషన్ పెంచుతూ సవరించిన ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయి సామాగ్రిని రిసెప్షన్ కేంద్రాల్లో అప్పగించే సరికి అర్ధరాత్రి అవుతుందనీ, పోలింగ్ సిబ్బందికి ఆన్ డ్యూటీ వర్తింపజేయాలని, అనంతరం హెడ్ క్వార్టర్స్‌కు చేరేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని వారు కోరారు. 10 రోజుల పాటు విధులు నిర్వహించే స్టేజ్ 1, 2 రిటర్నింగ్ అధికారులకు ప్రిసైడింగ్ అధికారుల కంటే తక్కువ రెమ్యూనరేషన్ ఇవ్వడం సమంజసం కాదని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రక్రియ పూర్తి కావడానికి అర్ధరాత్రి అవుతున్న చోట మహిళా సిబ్బందికి హెడ్ క్వార్టర్ చేరేందుకు తప్పనిసరిగా బస్సు సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు.

అది కిడ్నాప్ కాదు.. పిల్లలు ఆడిన డ్రామా

- లింగంపల్లి గురుకుల పాఠశాల విద్యార్థుల సుఖాంతం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లి గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థుల కిడ్నాప్ కథ సుఖాంతమైంది. అది కిడ్నాప్ కాదని, కేవలం పిల్లలు అల్లిన కట్టుకథగా విద్యార్థులు ఒప్పుకొన్నారు. వివరాల్లోకి వెళితే.. పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న రాకేష్, సిద్ధూ.. కారులో వచ్చి తమను ఎవరో కిడ్నాప్ చేశారని స్కూల్‌కు దూరంగా ఉన్న పొలాల వద్ద అచేతన స్థితిలో కనిపించారు. ఇది గమనించిన గ్రామస్తులు మొదట జహీరాబాద్ ఆస్పత్రికి, అక్కడి నుంచి సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. లోతుగా విచారించిన ఉపాధ్యాయ బృందం, ఇతర మండల శాఖ అధికారులు చివరకు పిల్లలను ఎవరూ కిడ్నాప్ చేయలేదని, అది పిల్లలు ఆడిన కిడ్నాప్ కథగా రుజువు చేశారు. ఇందుకు సంబంధించి ఎంపిడిఒ హరినందన్ రావు పాఠశాలకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో ఏం జరిగిందో చెప్పాలని విద్యార్థులను వివరణ కోరారు. తమతో స్నేహంగా ఎవరూ ఉండటం లేదనే కారణంతో ఇలాంటి కిడ్నాప్ డ్రామా ఆడినట్టు విద్యార్థులు అధికారుల ఎదుట ఒప్పుకొన్నారు. సినిమాలు, సీరియల్ ప్రభావం కారణంగానే విద్యార్థులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. ఇందుకు సంబంధించి ఎంపిడిఒ హరి నందనరావు, ప్రిన్సిపాల్ సురభి చైతన్యతో కలిసి.. విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

పునరుద్ధరణ పనులు తనిఖీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దక్షిణ మధ్య రైల్వే మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ శుక్రవారం సికింద్రాబాద్ డివిజన్‌లోని భద్రాచలం స్టేషన్‌తో సహా భద్రాచలం రోడ్డు - విష్ణుపురం సెక్షన్‌లో జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. ఇందులో ఆయనతో పాటు సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం (ఎబిఎస్ఎస్)లో భాగంగా భద్రాచలం రోడ్ రైల్వేస్టేషన్‌లో రూ.25.41 కోట్ల వ్యయంతో జరుగుతున్న పునరాభివృద్ధి పనులను జిఎం క్షుణ్ణంగా పరిశీలించారు. ఇందులో 12 మీటర్ల ఫుట్ ఓవర్‌బ్రిడ్జి, ప్లాట్‌ఫామ్ ఉపరితల పనులు, అదనపు కవర్ ఓవర్ ప్లాట్‌ఫామ్, లిఫ్టుల ఏర్పాటు, వెయిటింగ్ హాల్, సర్క్యులేటింగ్ ఏరియా పనులు తిలకించారు. స్థానిక అధికారులు జనరల్ మేనేజర్‌కు ప్రయాణికుల సౌకర్యాల గురించి వివరించారు. ఈ పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను జిఎం ఆదేశించారు. జనరల్ మేనేజర్ భద్రాచలం రోడ్డులోని క్రూ లాబీని తనిఖీ చేసి, లోకో పైలట్, ట్రైన్ మేనేజర్లకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను సమీక్షించారు. ఆయన సిబ్బందితో కూడా మాట్లాడి రోజువారీ పనిలో సాధారణంగా ఎదురయ్యే సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. భద్రాచలం రోడ్ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్‌లపై ప్రయాణికుల సౌకర్యాలను జనరల్ మేనేజర్ పరిశీలించారు. స్టేషన్‌లోని వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ (ఒ.ఎస్.ఒ.పి) స్టాల్‌లను కూడా ఆయన చేశారు. జనరల్ మేనేజర్‌ను అనేక మంది ప్రజాప్రతినిధులు కలిసి తమ విజ్ఞప్తులను అందజేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

In the honourable court of the M.A.C.T Cum 8 Additional District and Sessions judge : East Godavari District : At Rajamahendravaram.
M.V.O.P 358/2023

Between
Karri Srinuvasa Reddy and another ... Petitiners.
And
Rachamalla Ramesh and 3 others ...Respondents.

NOTICE

To,
Respondent-1
Rachamalla Ramesh s/o Narasima, Hindu, agad about 41years, driver of the accident vehicle, Residing at H.No. 5-8-150, Anandanagar, Nalgonda town, and mandal and district, Telengana state.

Please take notice that the above MVOP Posted to for your appearance on **DT 30-12-2025.** at about **10:30 AM.** before the honourable court in person or through your advocate failing which the matter will be decided exparte.

Kothapalli Srinivasu.
M.V.Rama Krishna Ready.
Advocates,
Rajahmundry. (A.P)
cell :- 9705256019.

ద్వితీయ సం'గ్రామం'లో పంపకాలు షురూ

- ముగిసిన మలిదశ ఎన్నికల ప్రచారం
- డబ్బుల వేటలో అభ్యర్థులు, మద్దతుదారులు
- ముఖం చాటేస్తున్న పైస్థాయి నాయకులు
- గెలవకపోతే భారీగానష్టపోనున్న రిజర్వ్‌డ్ అభ్యర్థులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మినహా 3,918 సర్పంచ్, 30,046 వార్డు మెంబర్లకు ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడ పోటాపోటీ పంపకాలు శుక్రవారం రాత్రి నుంచే మొదలయ్యాయి. ఓటుకు రూ.500 నుంచి రూ.5వేల వరకూ పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఒక అభ్యర్థి రూ.వెయ్యి పంచితే మరో అభ్యర్థి రూ.2వేలు పంపిణీ చేస్తున్నారు. వీటికి తోడు చీరెలు, కుక్కర్లు, చికెన్, మటన్, మద్యం సైతం పంపిణీ చేస్తున్నారు.

రవాణా ఖర్చులు సైతం..

వివిధ గ్రామ పంచాయతీల ఓటర్లు హైదరాబాద్, ఖమ్మం, ఇతర నగరాల్లో నివసిస్తున్నారు. వారిని రప్పించేందుకు అయ్యే రవాణా ఖర్చులు సైతం అభ్యర్థులు, మద్దతుదారులే భరిస్తున్నారు. ఒక్కొక్కరి రానుపోనూ రవాణా ఖర్చు హైదరాబాద్ నుంచి తక్కువలో తక్కువగా రూ.వెయ్యి వరకు అవుతున్నాయి. ఓటుకిచ్చే డబ్బులకు తోడు అదనంగా రవాణా ఖర్చులు సైతం ఇస్తామని ఫోన్లు చేసి చెబుతున్నారు. కొందరికి ఏకంగా ఫోన్ పే, గూగుల్ పే చేస్తున్నారు. నలుగురైదుగురు కలిసి ట్యాక్సీ మాట్లాడుకొని వస్తే అందుకయ్యే ఖర్చు కూడా తామే ఇస్తామని ఫోన్ చేసి చెబుతున్నారు

సిఎం రేవంత్‌రెడ్డితో అఖిలేష్ యాదవ్ భేటీ

- రాష్ట్ర, జాతీయ రాజకీయాలపై చర్చ
- ప్రముఖ ఆర్థిక వేత్త అరవింద్ సుబ్రమణియన్‌తోనూ సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డితో ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో సమావేశమయ్యారు. వివిధ రాష్ట్రాలు, జాతీయ స్థాయిలో రాజకీయ పరిస్థితులపై ఇరువురు చర్చించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అఖిలేష్‌కు రేవంత్‌రెడ్డి వివరించారు. ప్రముఖ ఆర్థికవేత్త, భారత ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ సిఎంను కలిశారు. ఇటీవల నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావడం, తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చి దిద్దేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఇరువురు చర్చించారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

'ఫుట్ బాల్ మ్యాచ్'కు భద్రత కట్టుదిట్టం

- ప్రతి ఒక్కరి కదలికలపైనా నిఘా
- 3000 మంది పోలీసులతో భారీ బందోబస్తు
- 450 సిసి కెమెరాలు, డ్రోన్ల వినియోగం
- మెస్సీకి జెడ్‌కేటగిరీ భద్రత, గ్రీన్ ఛానెల్ ద్వారా ప్రయాణం
- మ్యాచ్ లైవ్ టెలీకాస్ట్
- పాసులుంటేనే రండి : సిపి సుధీర్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో ప్రతిష్టాత్మకంగా జరగనున్న 'మెస్సి గోట్ ఇండియా టూర్' ఫుట్‌బాల్ మ్యాచ్'కు భద్రతను మరింత కట్టుదిట్టం చేశామని రాచకొండ సిపి సుధీర్‌బాబు తెలిపారు. శనివారం రాత్రి 7 గంటల నుంచి ఉప్పల్ స్టేడియంలో జరిగే ఫుట్‌బాల్ మ్యాచ్‌లో మెస్సీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారులు పాల్గొంటున్న విషయం తెలిసిందే. 39వేల మంది సిట్టింగ్ కెపాసిటీ ఉన్న ఉప్పల్ స్టేడియానికి 13 ఎగ్జిట్ గేట్స్ ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఫుట్‌బాల్ మ్యాచ్‌కు భద్రత కట్టుదిట్టం చేసినట్లు సిపి తెలిపారు. శుక్రవారం ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో భద్రత ఏర్పాట్లపై విలేకరుల సమావేశంలో డిసిపిలతో కలిసి సిపి వెల్లడించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకున్నామన్నారు. 3000 మంది పోలీస్‌లతో భద్రతను కట్టుదిట్టం చేశామన్నారు. రెండు ఆక్టోపస్ టీమ్‌లతోపాటు లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, ఎఆర్, టిఎస్ఎస్‌పి లాంటి 18 ప్లాటూన్స్‌ను ఉపయోగిస్తున్నామన్నారు. డాగ్‌స్క్వాడ్, బాంబ్‌స్క్వాడ్, ఎస్‌బి, సిసిఎస్, ఎస్ఒటితో పాటు వైద్యం, అగ్నిమాపక సిబ్బందిని సైతం రంగంలోకి దించామన్నారు. డ్రోన్ల ద్వార భద్రతను ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తామన్నారు.

రాచకొండ కమిషనరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూంతోపాటు ఐసిసిసి, ఉప్పల్ స్టేడియంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సెంటర్ నుంచి భద్రతను పర్యవేక్షిస్తామన్నారు. ఈ మ్యాచ్‌కు టికెట్, పాసులున్న వాళ్లు మాత్రమే రావాలని, పాసులు లేనివారు స్టేడియం వద్దకు రావద్దని స్పష్టం చేశారు. 34 ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేశామని, వాహనదారులు పోలీసులు సూచించిన విధంగా పార్కింగ్ స్థలంలోనే పార్కింగ్ చేయాలని చెప్పారు. 13న మెస్సీ రాజమండ్రి నుంచి సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకుంటారని, శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఉప్పల్ స్టేడియానికి చేరుకుంటారని అన్నారు. ఆన్‌లైన్‌లో పాసులను విక్రయించారని, స్టేడియం దగ్గర పాసులు అమ్ముబోరని తెలిపారు. మెస్సీకి జెడ్ కేటగిరీ భద్రత ఉందన్నారు. గ్రీన్ ఛానెల్ ద్వారా మెస్సీ ప్రయాణం చేస్తారని, మెస్సీని కలుసుకోవడం, ఫొటోలు తీయడం కుదరన్నారు. టికెట్లు, పాస్‌లు లేని వారు ఆందోళన చెందాల్సిన పనిలేదని, మ్యాచ్ లైవ్ టెలీకాస్ట్ ఉంటుందని, ఇంట్లో కూర్చొని టివిలో చూడాలని సిపి సూచించారు.

మ్యాచ్‌కు వచ్చేవారు మూడు గంటల ముందే స్టేడియానికి చేరుకోవాలన్నారు. మ్యాచ్‌కు వచ్చేవారు పబ్లిక్ ట్రాన్స్‌పోర్టును వినియోగిస్తే బాగుంటుందని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తవన్నారు. స్టేడియంలో ప్రతి ఒక్కరి కదలికలపైనా నిఘా ఉంటుందన్నారు. మహిళల రక్షణ కోసం షీ టీమ్స్‌ను రంగంలోకి దించుతున్నామన్నారు. అదనంగా విజిలెన్స్ విభాగాన్ని సైతం వినియోగిస్తున్నామని తెలిపారు. నిషేధిత వస్తువులను స్టేడియంలోకి తీసుకురావద్దన్నారు.

గ్రామానికి అంబులెన్స్ ఇప్పిస్తా.. గెలిపించండి

- హామీలు గుప్పిస్తున్న సర్పంచ్ అభ్యర్థి ముంగే శ్రీకాంత్ రెడ్డి
- సంగారెడ్డి జిల్లా గొర్రెకర్ గ్రామంలో వినూత్న ప్రచారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'గ్రామానికి అంబులెన్స్ ఇప్పిస్తా.. సర్పంచ్‌గా గెలిపించండి..' అంటూ సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం గొర్రెకల్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి ముంగే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మండలంలో రెండో విడతలో గ్రామపంచాయతీలకు జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు గ్రామాల అభివృద్ధికి హామీల వరాలు కురిపిస్తున్నారు. ఈనెల 14న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో శుక్రవారం అభ్యర్థులు ప్రచారానికి ముగింపు పలికారు. ఆఖరి రోజున తామంటే తామని ఓటర్లను ఆకట్టుకునే పనిలో ప్రచారాన్ని ముమ్మరం చేశారు. గొర్రెకల్ గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి ముగ్గురు అభ్యర్థులు బరిలో నిలవగా.. ఎవరికి వారు గ్రామ అభివృద్ధిపై హామీలు గుప్పిస్తూ ప్రచారాన్ని కొనసాగించారు. అందులో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి ముంగే శ్రీకాంత్ రెడ్డి తనదైన శైలిలో వినూత్నంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మా అన్న రవీందర్ రెడ్డి ఆశీస్సులతో ఆయన ఆశయాన్ని నెరవేర్చడానికి మీ ముందుకు వస్తున్నాను. సర్పంచ్ అభ్యర్థిగా గెలిపించినట్లయితే మండల కేంద్రంలోని వట్‌పల్లిలో గొర్రెకల్ శివారుని సరిహద్దుగా గుర్తించి గొర్రెకల పరిధిలోకి తెచ్చేలా పోరాడుతాను. గ్రామానికి అత్యవసర వైద్యం కొరకు అంబులెన్స్‌ను ఇప్పిస్తాను. పేదింటి ఆడపడుచుల వివాహాలకు పెళ్లి కానుకగా రూ.21 వేలు, పేద విద్యార్థులు సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యేందుకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను ఇస్తాను. ఆరు నెలలకు ఒకసారి ఉచిత ఆరోగ్య క్యాంపు, నిరుద్యోగులకు జాబ్ మేళా నిర్వహించి ప్రయివేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తాను. గ్రామంలోని అసైన్డ్ భూమిని గుర్తించి కబ్జాదారుల నుంచి విడిపించి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందిస్తాను.' అంటూ హామీలు కురిపిస్తూ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. కాగా, ఆదివారం జరిగే ఎన్నికల్లో వీరి భవితవ్యం తేలనుంది.

ముగిసిన దక్షిణ ప్రాంత స్కూల్ బ్యాండ్ పోటీలు

- పైప్ బ్యాండ్ (బాలికలు) పోటీల్లో తెలంగాణకు మొదటి స్థానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమగ్ర శిక్ష తెలంగాణ ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో నిర్వహించిన దక్షిణ ప్రాంత బ్యాండ్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, అండమాన్ అండ్ నికోబార్, లక్షద్వీప్, పుదుచ్చేరి రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల విద్యార్థి బృందాలు ఉత్సాహంగా పాల్గొన్నాయి. బ్రాస్ బ్యాండ్ (బాలురు, బాలికలు), పైప్ బ్యాండ్ (బాలురు, బాలికలు) విభాగాల్లో దక్షిణ ప్రాంత స్థాయిలో విజేతగా నిలిచిన బృందాలు ఢిల్లీలో జరగబోయే జాతీయ స్థాయి బ్యాండ్ పోటీకి సౌత్‌జోన్ నుంచి ప్రాతినిధ్యం వహించనున్నాయి. ముగింపు కార్యక్రమంలో సిఎం సలహాదారు కె.కేశవరావు, పాఠశాల విద్య సంచాలకులు డాక్టర్ ఈ.నవీన్ నికోలస్, జాయింట్ డైరెక్టర్ రాజీవ్ తదితరులు హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ పోటీల్లో బ్రాస్ బ్యాండ్ (బాలురు) పోటీల్లో తెలంగాణ రెండో స్థానాన్ని, బాలికల విభాగంలో మూడో స్థానాన్ని దక్కించుకుంది. పైప్ బ్యాండ్ (బాలికల విభాగం)లో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది.

ప్రజల్లో ఉంటేనే అధికారం

- రాజకీయాల్లో ఎత్తుపల్లాలు సహజం
- యుపిలో బిజెపి రెండో స్థానం
- త్వరలో కెసిఆర్‌తో సమావేశం
- ఎస్‌పి అధినేత అఖిలేశ్ యాదవ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజల్లో నిత్యం ఉంటేనే ఏ పార్టీకైనా అధికారం తప్పకుండా వస్తుందని సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) అధినేత, ఎంపి అఖిలేశ్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు (కెటిఆర్)ను మర్యాదపూర్వకంగా కలిశారు. తాజా రాజకీయ అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో మాజీమంత్రులు, బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు తన్నీరు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మీడియాతో అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణలో రాజకీయ పరిస్థితులు మారుతాయనీ, నిరంతరం ప్రజలతో ఉంటే బిఆర్ఎస్‌కు ప్రజలు తిరిగి పట్టం కడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడితే, వారు తప్పకుండా ఆదరిస్తారని అన్నారు. రాజకీయాల్లో ఎత్తుపల్లాలు సహజమని చెప్పారు. ఎన్నికల్లో జయాపజయాలు ఉంటాయని వివరించారు. ఉత్తరప్రదేశ్‌లో తమ పార్టీ ప్రస్థానాన్ని ఉదహరిస్తూ.. 'గతంలో మేం కూడా చాలా తక్కువ సీట్లు గెలిచాం. కానీ ప్రజల వెంటే మేము న్నాం. ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు మాకు అండగా నిలిచారు. వారి మద్దతుతోనే నేడు యుపిలో బిజెపిని రెండో స్థానానికి నెట్టాం. 37 మంది ఎంపిలతో లోక్‌సభలో బలంగా ఉన్నాం. ప్రజలు ఎప్పుడు ఎవరికి అండగా నిలబడతారో ఎవరూ ఊహించలేరు. ప్రజల వెంట ఉంటే వారే మనకు అవకాశాన్ని ఇస్తారు.'అని అఖిలేశ్ యాదవ్ అన్నారు. పాలకులకు విజన్ ఎంతో అవసరమని చెప్పారు. దేశానికి ప్రగతిశీల రాజకీయాలు కావాలన్నారు. ప్రజలు విభజించి రాజకీయాలు చేసే పద్ధతికి స్వస్తి పలకాలని చెప్పారు. రాజకీయాల్లో ప్రతికూలత పోవాలని, అభివృద్ధి, సానుకూల దృక్పథంతో కూడిన ప్రగతిశీల రాజకీయాలు రావాలని ఆయన ఆకాంక్షించారు. త్వరలోనే కెసిఆర్‌తో సమావేశమవుతానని అన్నారు.

యుపిలో ఎస్‌పి అద్భుత విజయం : కెటిఆర్

ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయినప్పటికీ, పార్లమెంటు ఎన్నికల్లో అద్భుత విజయం సాధించి దేశంలోనే మూడో అతిపెద్ద పార్టీగా ఎస్పీని నిలబెట్టిన అఖిలేశ్ యాదవ్ స్ఫూర్తిదాయకమని కెటిఆర్ చెప్పారు. 37 ఎంపి స్థానాలను గెలిచారని అన్నారు. అదే స్ఫూర్తితో బిఆర్ఎస్ భవిష్యత్తులో ముందుకు సాగుతుందన్నారు. ప్రజల వెంట నిలబడి మళ్లీ అధికారంలోకి వస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అఖిలేశ్ యాదవ్ మరోసారి హైదరాబాద్ వచ్చినప్పుడు కెసిఆర్‌తో సమావేశమవుతారని వివరించారు.

మతతత్వ బిజెపిపై ఇండియా కూటమిగా పోరాడుతాం

- ఎపి పార్టీల మద్దతుతోనే కేంద్ర సర్కారు మనుగడ
- వచ్చే ఎన్నికల్లో యుపిలో ఎగిరేది ఎస్‌పి జెండానే
- సదర్ సమ్మేళనంలో యుపి మాజీ సిఎం అఖిలేశ్ యాదవ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇండియా కూటమిలోని పార్టీలన్నీ ఒక్కతాటిపైనే ఉన్నాయని, మతతత్వ బిజెపికి వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు కొనసాగిస్తామని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షులు, ఉత్తరప్రదేశ్ మాజీ సిఎం అఖిలేశ్ యాదవ్ స్పష్టం చేశారు. ఎపికి చెందిన పార్టీల మద్దతుతోనే కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ సర్కారు మనుగడ సాగిస్తోందన్నారు. ఆ రెండు పార్టీలు లేకపోతే మోడీ సర్కారు అధికారంలోకి వచ్చేది కాదని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆదర్శ్‌నగర్‌లోని ఎమ్మెల్యే నివాస సముదాయంలో జరిగిన సదర్ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పలు పార్టీల నాయకులు వేదికపై ఉన్నప్పటికీ యాదవులందరూ ఒక్కటేనని చెప్పారు. భగవాన్ శ్రీకృష్ణుడి ఆశీస్సులు యాదవులందరిపైనా ఉంటాయన్నారు. యుపి, ఎపి నుంచి కూడా తమ పార్టీకి చెందిన నేతలు ఇక్కడకు వచ్చారని తెలిపారు. రాజకీయాలకు అతీతమైన వేదిక ఇది అనీ, వేర్వేరు పార్టీలకు చెందిన వారమైనప్పటికీ, అందరం కూడా ఒక్కటేనని ప్రకటించారు. పెళ్లిళ్ల సందర్భంగా గుర్రపు బగ్గీపై కూర్చుని బరాత్‌లో పాల్గొనటం చూశానని, ఇప్పుడు ఇక్కడ గుర్రపు బగ్గీపై ప్రధాన వేదిక వద్దకు తనను తీసుకురావడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. మాజీ ఎంపి అంజన్ కుమార్ ప్రత్యేకత ఉన్న నాయకుడని, అందుకే తనను బగ్గీపై ఊరేగించారని చమత్కరించారు. తెలంగాణ సంప్రదాయ పద్ధతిలో సాదరంగా ఆహ్వానం పలకడమే కాకుండా శ్రీకృష్ణ నినాదాలు చేయడం ఈ కార్యక్రమానికి మరింత శోభనిచ్చిందన్నారు. ఉత్తరప్రదేశ్ బిజెపిని వెనక్కు నెడుతున్నామని, వచ్చే ఎన్నికల్లో ఎస్‌పి సారథ్యంలోని కూటమి జెండా ఎగరటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ములాయం సింగ్ యాదవ్ తనను చిన్న వయస్సులోనే ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి సిఎంను చేశాడని కొనియాడారు. తనలాగే అనిల్ కుమార్ యాదవ్ కూడా చిన్న వయస్సులోనే రాజ్యసభ సభ్యుడయ్యారని ప్రశంసించారు. నదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి రాష్ట్ర పండుగగా ఆచరించడం సంతోషించదగ్గ విషయమని కితాబిచ్చాడు. అందుకు కృషి చేసిన అంజన్‌కుమార్ యాదవ్, ఇతర నేతలను ఆయన అభినందించారు. సదర్ ఉత్సవానికి ప్రత్యేక గుర్తింపు ఇచ్చిన సిఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమ్మేళనానికి వేలాదిగా జనం హాజరయ్యారనీ, ఇంకా ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు.

కార్యక్రమంలో ఎంపి అనిల్‌కుమార్ యాదవ్, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్, నాంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి ఫిరోజ్ ఖాన్, పిసిసి మాజీ అధ్యక్షులు విహెచ్, టిపిసిసి నేత గౌరీ యాదవ్, యాదవ సంఘం నేతలు, తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు, బతుకమ్మ ఆటపాటలు, ఒగ్గుడోలు కళాకారుల ప్రదర్శనలు, ఉత్తరాది డ్రమ్స్ ప్రదర్శనతో అఖిలేశ్ యాదవ్‌ను అంజన్‌కుమార్, అనిల్‌కుమార్‌యాదవ్, విహెచ్, తదితరులు స్వాగతించారు. గుర్రపు బగ్గీపై ఊరేగింపుగా వేదికవద్దకు తీసుకెళ్లారు. ఎకెవై పేరుతో యువత హల్‌చల్ చేసింది. దున్నపోతుల ప్రదర్శనను చేసింది. సభలోకి పట్టుకొచ్చిన చిన్న దూడ అందర్నీ ఆకట్టుకున్నది.

దేవత్ జోసెఫ్ కుటుంబానికి రూ.5 లక్షలు, ప్రభుత్వ ఉద్యోగం

- ప్రభుత్వానికి హెచ్‌ఆర్‌సి సిఫారసు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బాధిత దేవత్ జోసెఫ్ కుటుంబానికి రూ.5 లక్షల పరిహారంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (టిజిహెచ్‌ఆర్‌సి) రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఖమ్మం గిరిజన సంక్షేమ వసతి గృహంలో 10 సంవత్సరాల దేవత్ జోసెఫ్ మరణంపై విచారించిన కమిషన్ శుక్రవారం తీర్పును వెలువరుస్తూ ఆరు నెలల్లోగా సిఫారసులను అమలు చేసి నివేదికను సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ నాయకత్వంలో విచారించిన కమిషన్ గిరిజన సంక్షేమ విభాగం అధికారుల తీవ్ర నిర్లక్ష్యం కారణంగా దేవత్ జోసెఫ్ మరణించారని నిర్ధారించింది. మరణించిన బాలుని తల్లి చెవిటి, మూగ వైకల్యంతో బాధ పడుతూ ఇప్పుడిప్పుడే జీతం అందుకునే స్థితికి చేరిందని కమిషన్ గుర్తుచేసింది.

ఆ తల్లి తన కుమార్తెతో పాటు వృద్ధురాలైన తన అత్తను పోషించాల్సిన ఒంటరి మహిళ అని తెలిపింది. ఈ నేపథ్యంలో అవసరమైన నిబంధనలను సడలించి లాస్ట్ గ్రేడ్‌లో క్యాటగిరీలో మానవతా దృక్పథంతో ఉద్యోగం కల్పించాలని కోరింది. ప్రభుత్వం తీసుకునే ఆ చర్య గౌరవం, మౌలిక హక్కులను కాపాడే చర్య అని తెలిపింది.

మారుతి సుజుకి వింటర్ కేర్ డ్రైవ్

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీదారు మారుతి సుజుకి తన వినియోగదారుల కోసం "వింటర్ స్పెషల్ సర్వీస్ డ్రైవ్' ప్రారంభించినట్లు తెలిపింది. ఈ డ్రైవ్‌లో భాగంగా కస్టమర్లు తమ వాహనాలను సమీప సుజుకి ఆథీకృత సర్వీస్ వర్క్‌షాప్‌కు తీసుకెళ్లి 27 పాయింట్లతో కూడిన సమగ్ర తనిఖీ చేయించుకోవచ్చని పేర్కొంది. దీనికి అదనంగా ఉచిత కార్ వాష్ కూడా లభిస్తుందని పేర్కొంది. ఈ క్యాంపెయిన్ 2026 జనవరి 4 వరకు కొనసాగుతుందని తెలిపింది.

సన్‌ఫీస్ట్ నుంచి కొత్త కుకీలు

హైదరాబాద్ : ప్రముఖ ఎఫ్ఎంసిజి కంపెనీ ఐటిసి లిమిటెడ్ తన సన్‌ఫీస్ట్ బ్రాండ్‌లో నట్స్‌తో కూడిన కొత్త కుకీలను విడుదల చేసినట్లు తెలిపింది. నెయ్యిలో వేయించిన నట్స్ కుకీల అద్వితీయమైన రుచిని పొందవచ్చని ఆ సంస్థ ప్రతినిధి కవితా చతుర్వేది పేర్కొన్నారు. ఇందులో జీడిపప్పులు మాత్రమే కాకుండా బాదం కూడా ఉంటుందన్నారు.

చిన్నారిపై ట్యూషన్ టీచర్ దాష్టీకం

- అట్లకాడతో వాతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన జరిగింది. సరిగ్గా చదవడం లేదని ఏడేళ్ల బాలుడిపై ట్యూషన్ టీచర్ అట్లకాడతో వాతలు పెట్టింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. ఓయూ కాలనీకి చెందిన ఏడేళ్ల వల్లు తేజ నందన్ ఒకటో తరగతి చదువుతున్నాడు.

స్థానికంగా ఉన్న మానస అనే టీచర్ వద్దకు బాలుడిని తల్లిదండ్రులు ట్యూషన్‌కు పంపుతున్నారు. గురువారం సాయంత్రం ట్యూషన్‌కు వెళ్లాడు. అయితే, సరిగ్గా చదవడం లేదనే కారణంతో గ్యాస్ స్టౌవ్‌పై వేడి చేసిన అట్లకాడతో బాలుడి చేతులు, కాళ్లు, చెంపలపైన మొత్తం 8 చోట్ల ట్యూషన్ టీచర్ వాతలు పెట్టింది. విషయం తెలుసుకున్న బాలుడి తల్లిదండ్రులు ఫిల్మ్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. బాలుడిని వైద్య పరీక్షల నిమిత్తం గోల్కొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయాల వల్ల బాలుడు నడవలేకపోతున్నాడని తెలిసింది. తమ కొడుకును విచక్షణారహితంగా అట్లకాడతో కాల్చిన మానసపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

కార్మికుల వేతనాలు పెంచాలి

- 'షాహి ఎక్స్‌పోర్ట్' యాజమాన్యం వేధింపులు ఆపాలి
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు రమ లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా

ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాచారం పారిశ్రామిక ప్రాంతంలోని షాహి ఎక్స్‌పోర్ట్ ప్రయివేటు లిమిటెడ్ (గార్మెంట్) కంపెనీ కార్మికుల వేతనాలు పెంచాలని, యాజమాన్యం వేధింపులు ఆపాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు రమ డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ చిక్కడపల్లిలోని లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కంపెనీలో దాదాపు 1600 మంది మహిళలు 16 ఏండ్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి 2011లో జారీ చేసిన జీవో ప్రకారం వేతనాలే ఇప్పటికీ అమలు చేస్తున్నారన్నారు. పైకి ఎక్కువ వేతనాలు ఇస్తున్నామని చెబుతున్నా.. వాస్తవంగా రూ.9000 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. అలాగే పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు లేవని, వర్కర్స్‌కు క్యాంటీన్ సదుపాయం కూడా కల్పించలేదని అన్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే మహిళలని కూడా చూడకుండా వారిపై దాడులకు దిగుతున్నారని వాపోయారు. నిర్బంధించి పనులు చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు పెంచాలని దాదాపు 1200 మంది మహిళలు ధర్నా చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని, వెంటనే షాహి ఎక్స్‌పోర్ట్ ప్రయివేటు లిమిటెడ్ కార్మికులకు వేతనాలు పెంచి ప్రత్యేక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సిఐటియు రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ.. మహిళా కార్మికులకు వేతనాలు పెంచాలంటే యాజమాన్యం బెదిరింపులకు పాల్పడుతున్నదన్నారు. మహిళలు ధర్నాలు చేస్తుంటే కనీసం ఏ ఒక్క ప్రజాప్రతినిధైనా సంఘీభావం తెలపలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఓ వైపు కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. షాహి ఎక్స్‌పోర్ట్ ప్రయివేటు లిమిటెడ్‌లో పనిచేసే మహిళా కార్మికులకు సిఐటీయూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సహాయ కార్యదర్శి ఈశ్వరరావు, ఉపాధ్యక్షులు వీఎస్ రావు, హైదరాబాద్ అధ్యక్షులు దశరథ్, మేడ్చల్ అధ్యక్షులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం-నల్లమల్ల సాగర్‌పై ఎలా ముందు కెళ్దాం?

- నేడు ఢిల్లీలో మంత్రి ఉత్తమ్ అత్యున్నత సమావేశం
- న్యాయవాదులు, సాంకేతిక నిపుణులతో భేటీ
- ఎపిపై సుప్రీంలో అభ్యంతరాలు దాఖలు
- తెలంగాణకు జరిగే నష్టంపై చర్చ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోలవరం-బనకచర్ల స్థానంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన పోలవరం-నల్లమల్ల సాగర్‌తో తెలంగాణకు తీవ్ర నష్టం జరుగుతుందని నీటి పారుదల నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. న్యాయ పోరాటం ద్వారా ఈ ప్రాజెక్ట్‌ను అడ్డుకోవాలనే తమ ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఈ క్రమంలో ఎపి ప్రభుత్వంపై సుప్రీంకోర్టులో అభ్యంతరాలు దాఖలు చేసేందుకు సిద్ధమైంది. ఈ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో తెలంగాణ తరపున వాదించాలని సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్విని రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థించింది. పోలవరం-బనకచర్ల సుప్రీంకోర్టు కేసుపై ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో నేడు మధ్యాహ్నం 12 గంటలకు సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు. సింఘ్వితో పాటు నీటిపారుదల నిపుణులతో ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమావేశమవుతారు. ప్రాజెక్ట్‌పై లోతుగా చర్చించి ఎలా ముందుకెళ్లాలో నిర్ణయిం తీసుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది.

ఏంటీ వివాదం.....

గోదావరినదిలో ఏటా సగటున 1,000 టీఎంసీలకు పైగా వరద నీరు సముద్రంలో కలిసిపోతోంది. ఏపీ చెబుతున్న లెక్కల ప్రకారం వర్షాకాలంలో 129 రోజులు వరద పోటెత్తుతుంది. ఇరు రాష్ట్రాలు వాడుకోకుండా సముద్రంలో వృథాగా కలుస్తున్న వరదనీటిలో 200 టిఎంసిలను మళ్లించేందుకు పోలవరం-బనకచర్ల ప్రాజెక్ట్‌ను ప్రతిపాదించామని ఎపి అంటోంది. రూ.80,112 కోట్లతో చేపట్టనున్న ఈ ప్ర